క్లుప్తంగా

35వ వార్డులో పింఛన్ల పంపిణీ



పండా వీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వార్డు సెక్రటరీ జగన్నాథం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో తొలిరోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. వార్డులో మొత్తం ఆరు సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, వలంటీర్లు వార్డులోని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మిగిలిన అయిదు శాతం లబ్ధిదారులకు కూడా అందజేస్తామని తెలిపారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర శుక్రవారం కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన అభ్యర్థులకు పోస్టింగులిచ్చారు. కొంత మందికి పదోన్నతులు కల్పించారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని త్వరితగతిని ఉద్యోగాలు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో డి.సత్యానారాయణ, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి పీజీ స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ ఆసెట్ రాసి, సీట్ రాని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

3న పూర్వ విద్యార్థుల సమావేశం

డాబాగార్డెన్స్ : ఈ నెల 3న ఎంవీపీ డబుల్‌రోడ్డులో గల ఐఏఎం కళాశాలలో ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం (కాకినాడ) సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న పూర్వ విద్యార్థుల సమావేశంలో ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, ఇంజనీర్లు పాల్గొంటున్నట్లు తెలిపారు.

మునిగిపోయిన బోట్లు బయటకు తీయాలి

మహారాణిపేట : ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో సగం కాలి మునిగిపోయిన బోట్లను వెలికి తీయాలని బీజేపీ విశాఖ పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పోర్టు యాజమాన్ని కోరారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. బీజేపీ నాయకులు శ్రీరంగం ధనేశ్వరరావు, సుజాతరాజ్, ధోని నాగరాజ్, కారాల మహేష్, డాల్ఫిన్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్రాజు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో ప్రపంచీకరణ -ఉపాధిపై సదస్సు

డాబాగార్డెన్స్ : ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర సిటు వ్యవస్థాపక కార్యదర్శి నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 30, 31 తేదీల్లో విశాఖలో ప్రపంచీకరణ-ఉపాధిపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. శుక్రవారం సిటు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సదస్సు వివరాలు వెల్లడించారు. నండూరి వర్ధంతి (నవంబర్ 29 నుంచి)ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ పరిశ్రమల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎస్. జ్యోతీశ్వరరావు, పి. వెంకట్‌రెడ్డి, పి. మణి, బి. జగన్ పాల్గొన్నారు.



ఇది కదా అభివృద్ధి

- ప్రమాదాల నివారణకు విస్తృతంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు
- సిగ్నలింగ్ వ్యవస్థ బాగుందని ప్రజల కితాబు
- పటిష్ట చర్యలు తీసుకుంటున్న పోలీసు ఉన్నతాధికారులు

నాడు చాలా చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేసేవి కాదు. ట్రాఫిక్ ఐలాండర్లు నిర్దేశించిన చోట కనిపించేవి కాదు. జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు అలంకారప్రాయంగా ఉండేవి తప్ప వెలిగేవి కాదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉండేది. ఉదయం ఆలస్యంగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలిగేవి.

నేడు ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల వ్యవస్థ పనితీరు చక్కగా ఉంది. అన్ని జంక్షన్లలో ఇవి వెలుగుతున్నాయి. ఐలాండర్లు కూడా వాటికి నిర్దేశించిన చోట కనిపిస్తున్నాయి. ఉదయం నుంచి ట్రాఫిక్ లైట్లు వెలిగి సిబ్బంది లేకపోయినా వాహన చోదకులు రహదారి నియమాలు పాటిస్తూ ప్రయాణాలు చేస్తున్నారు.

సిగ్నల్ క్లియర్

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నగర సుందరీకరణలో భాగంగా ట్రాఫిక్ ఐలాండర్ల ఏర్పాటు, నూతన సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీరణకు నడుం బిగించింది. ఇప్పుడు కూడళ్లలో సిగ్నల్స్‌ను జంప్ చేసి వెళ్లిపోయే వీలు లేకుండా అన్ని చోట్ల పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



సరస్వతీ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు

డాబాగార్డెన్స్ : నగరం అభివృద్ధి చెందుతోంది. అదే రీతిన జనాభా పెరుగుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు నియోజకవర్గ పరిధిలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఐల్యాండ్ల వద్ద కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటయ్యాయి. వాటి పనితీరును పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి.

నియోజకవర్గ పరిధిలో ట్రాఫిక్ సిగ్నల్స్..

డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ కూడలి, మహిళా పోలీస్ స్టేషన్, సౌత్ జైల్‌రోడ్డు, లీలామహల్ జంక్షన్, రామకృష్ణా జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పోలీస్ బ్యారెక్స్, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి జంక్షన్, రామకృష్ణా రైతు మార్కెట్ జంక్షన్.. ఇలా నియోజకవర్గ పరిధిలోని పలు జంక్షన్లు, ఐల్యాండ్లు, కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు.

సిబ్బంది లేకపోయినా..

ట్రాఫిక్ సిబ్బంది లేకపోయినా సిగ్నల్ లైట్లు ఆన్‌లో ఉంటే.. వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సిగ్నల్ లైట్స్ అనుగుణంగా ప్రయాణిస్తారు. అంతే కాక ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా ఆన్‌లో ఉండడంతో సిగ్నల్ జంపింగ్స్ ఉండవు.

ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని..

సిటీ, నగర శివార్లలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని నగర పోలీస్ కమిషనర్ భద్రతా చర్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గతంలో ఉదయం 9 గంటలైనా సిగ్నల్ లైట్లు వెలిగేవి కావు. నగరంలోని సంగం శరత్ జంక్షన్ వద్ద ఇటీవల ఉదయం లారీని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో పలువురు పాఠశాల పిల్లలు ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. అదే రోజు మధురవాడలోనూ ఆటో తిరగబడి పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ రూల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. ఉదయం 7 గంటలకే ట్రాఫిక్ సిబ్బందితో పాటు.. జంక్షన్లలో గల ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు. గతంలో పలు జంక్షన్లలో గల ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు దిష్టి బొమ్మల్లా.. నిరుపయోగంగా ఉండేవి. ఇటీవల చేపట్టిన భద్రతా చర్యలు మంచి ఫలితాన్నిస్తున్నాయి. నియోజకవర్గ పరిధి అన్ని జంక్షన్లలో గల ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఉదయం 7 గంటల నుంచే అందుబాటులోకి రావడంతో రోడ్డు ప్రమాదాలు కొంత మేర తగ్గుతున్నట్లు నగర ప్రజలు 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు.

నియోజకవర్గంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ఇలా

- డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ కూడలిలో
- డాల్ఫిన్ హోటల్ దరి మహిళా పోలీస్ స్టేషన్ వద్ద
- అంబేడ్కర్ విగ్రహం వద్ద సౌత్ జైల్‌రోడ్డులో
- లీలామహల్ జంక్షన్ ఏరియాలో
- రామకృష్ణా జంక్షన్ ప్రాంతంలో
- కలెక్టరేట్ జంక్షన్ వద్ద
- జగదాంబ సమీపంలోని లేపాక్షి వద్ద
- పోలీస్ బ్యారెక్స్ ఏరియాలో
- పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో
- వన్‌టౌన్‌లోని రామకృష్ణా రైతు మార్కెట్ జంక్షన్‌లో.



స్టేషన్ రోడ్డు బీఎన్ఆర్ జంక్షన్‌లో..



రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్ జంక్షన్‌లో..

సిగ్నల్ లైట్ల వ్యవస్థ బాగుంది..



సిటీ/నియోజకవర్గ పరిధిలో గల అన్ని సిగ్నల్ పాయింట్ల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించే సిగ్నల్ లైట్లు వెలుగుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నా.. లేకపోయినా సిగ్నల్ లైట్లను వాహన చోదకులు పాటిస్తున్నారు. గతంలో రన్నింగ్‌లో లేని జంక్షన్లలో కూడా సిగ్నల్ లైట్లు వెలగడం శుభపరిణామం.

– పాల సురేష్, కాంట్రాక్ట్ ఉద్యోగి, హిందూస్థాన్ షిప్‌యార్డ్

ఉదయం 7 నుంచే..



ఉదయం 7 గంటల నుంచే కూడళ్లలో గల సిగ్నల్ లైట్లు వెలగడం మంచిదే. ప్రమాదాల నివారణలో, ట్రాఫిక్ నియంత్రణలో సిగ్నల్ లైట్లు ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. ఉదయం వేళల్లో పాఠశాల పిల్లలు స్కూళ్లకు వెళ్లే తరుణంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్ కమిషనర్ భద్రతకు తీసుకుంటున్న నిర్ణయాలు బాగున్నాయి.

– సీహెచ్ పవన్‌కుమార్, ద్విచక్ర వాహనదారుడు

ఇంద్రాణి జగ్గారావు కృషి చిరస్మరణీయం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏయూ మాజీ వీసీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు తదితరులు

డాబాగార్డెన్స్ : విద్యారంగ అభివృద్ధికి ఇంద్రాణి జగ్గారావు చేసిన కృషి చిరస్మరణీయమని ఏయూ మాజీ వీసీ ప్రొఫెసర్ జి. నాగేశ్వరరావు అన్నారు. ఏవీఎన్ కళాశాల పూర్వ కరస్పాండెంట్, వైస్ చైర్‌పర్సన్ ఇంద్రాణి జగ్గారావు 90వ జయంతి శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా ఇంద్రాణి చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో గ్రామీణ మహిళల విద్యాభివృద్ధికి తన తల్లి ఇంద్రాణి జగ్గారావు ఎంతగానో కృషి చేశారన్నారు. గీతం యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శాంతిలత, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, ఏయూ ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పైడి రజని, గాంధీ, స్వరాజ్యలక్ష్మి, మల్లిక, అనంతలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

220 రోజులకు చేరుకున్న రూ. 10 భోజనం

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆస్పత్రిలో రూ. 10 భోజనం పంపిణీ కార్యక్రమం 220 రోజులు పూర్తి చేసుకుంది. రౌండ్ టేబుల్ సంస్థ సహకారంతో 200 రోజుల పాటు రూ. 10 భోజనాలు అందించారు. ఇప్పుడు రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఎలైట్ సర్వీస్ ట్రస్టు మద్దతుతో, వివేకానంద సంస్థ ఘోషా ఆస్పత్రి రోగులు, వారి బంధువులకు రూ. 10 భోజనాలు అందజేస్తున్నారు. శుక్రవారం భోజనాల పంపిణీని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్ ప్రారంభించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుర్గారావు, సెక్రటరీ డొక్కా రవీంద్రనాథ్, రాథోడ్, వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రూ. 10 భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

'ఉపేంద్రగాడి అడ్డా' సినిమా యూనిట్ సందడి



కేక్ కట్ చేస్తున్న హీరో ఉపేంద్ర

సీతమ్మధార : నగరంలోని శరత్ థియేటర్‌లో ఉపేంద్రగాడి అడ్డా సినిమా యూనిట్ సందడి చేసింది. ఎస్ఎస్ఎల్‌వీ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కంచర్ల అచ్యుతరావు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో విడుదలయింది. ఈ సందర్భంగా శరత్ థియేటర్ వద్ద హీరో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. హీరోతో పాటు కుటుంబ సభ్యులు, దర్శకుడు ఆర్యన్ సుభాన్, ఇతర యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ విశాఖలో తాను 23 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరో నాలుగు సినిమాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. హీరో ఉపేంద్ర మాట్లాడుతూ కంటెంట్ ఉంటే కొత్త హీరో అయినా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు.

భూకబ్జాదారులపై చర్యలకు డిమాండ్

డాబాగార్డెన్స్ : వంశపారంపర్యంగా వచ్చిన తమ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని, తప్పుడు డాక్యుమెంట్లతో ఆ భూములపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఇచ్చిన ప్లాన్‌ను రద్దు చేయాలని గుజ్జు చిన్నమ్మలు కోరారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాత గుడ్ల రాములుకు మద్దిలపాలెంలో సుమారు 3,250 గజాల స్థలం ఉండేదని, ఈ స్థలం పక్కన రాములు సోదరుడు సీతయ్యకు 3000 గజాల స్థలం ఉందని చెప్పారు. సీతయ్య వారసులు వారి స్థలంతో పాటు రాములు స్థలాన్ని కూడా కబ్జా చేశారన్నారు. కబ్జా చేసిన వారిలో సీతయ్య వారసులు గుడ్ల లక్ష్మి, గుడ్ల సన్యాసిబాబురెడ్డి, గుడ్ల సుజాత, సీరపు రమణబాయి, సీరపు పద్మావతి, వెంపాడ శాంతికుమారి, ఎస్. కనకమహాలక్ష్మి, నారాయణరెడ్డి ఉన్నారని తెలిపారు. వీరు ఆ స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో విక్రయించారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయించనున్నట్లు చెప్పారు. సమావేశంలో రాములు వారసులు అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించినట్లయితే పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్న ట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తు లు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

–ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్



39వ వార్డులో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : దేశ చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ప్రజలంతా జగనే కావాలని కోరుకుంటున్నారన్నారు. జీవీఎంసీ 33వ వార్డు పరిధి అల్లిపురం కుమ్మరవీధి సచివాలయం పరిధిలో ×ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే×కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా తాము ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు సంతోషంగా ఆహ్వానిస్తున్నారన్నారు. సచివాలయ పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.8 కోట్ల 58 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు రూ.8 కోట్ల 21 లక్షలు, మొత్తంగా రూ.16 కోట్ల 79 లక్షలు అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వా తాతలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, సచివాలయ ఇన్‌చార్జి పాల శ్రీహరిరెడ్డి, పోలవరపు పావని, ధర్మారావు, నీలమ్మ వేప చెట్టు ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, నీలపు అయ్యప్పరెడ్డి, పచ్చిరపల్లి రాము, మాదా బత్తుల రమేష్ పాల్గొన్నారు.

31వ వార్డులో..

జీవీఎంసీ 31వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో ఆంధ్రపదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. చాకలిపేటలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో రూ.12 కోట్ల 25 లక్షలు లబ్ధి పొందారని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కాండ్రేగుల నాయుడు, పి. శ్రీదేవి, ధోనీ పాల్గొన్నారు.

30వ వార్డులో..

జీవీఎంసీ 30వ వార్డు తాడివీధి సచివాలయం పరిధి కమ్యూనిటీ హాల్లో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కోదూరు అప్పలరత్నం, మండల అధ్యక్షుడు పీతల వాసు తదితరులు పాల్గొన్నారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. గృహసారథులకు కిట్లు అందజేశారు.

39వ వార్డులో..

జగదాంబ : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డు 201 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే జెండా ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో సచివాలయం పరిధిలో రూ. 15 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. ప్రజా సంక్షేమానికి మళ్లీ జగనే కావాలని ఎమ్మెల్యే వాసుపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ ధర్మకర్తల చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, క్లస్టర్-3 ఇన్‌చార్జి సనపల రవీంద్రభరత్, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన షాపుల పరిశీలన



దగ్ధమైన షాపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట : బీచ్‌రోడ్డు గాంధీ బొమ్మ దగ్గర కాలిపోయిన షాపులను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. వలలు, చేపల వేటకు సంబంధించి సామగ్రి స్టోరేజ్ చేసుకునే మూడు షాపులు గురువారం రాత్రి కాలిపోయిన సంగతి విదితమే. తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వార్డు అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి, వెంకటలక్ష్మి, రామరాజు, కోసూరు వాసు, షాపు యాజమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా రోహిణి



రోహిణి

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల సీతారామస్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా సనపల రోహిణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ దేవదాయ శాఖ నియమ నిబంధనలు అనుసరించి బాధ్యతగా విధి నిర్వహిస్తానని చెప్పారు. ట్రస్ట్‌బోర్డు సభ్యురాలిగా నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి, ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవోగా లక్ష్మీతులసి

మహారాణిపేట: కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ లక్ష్మీతులసి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ వాసుదేవ పదోన్నతిపై కర్నూలు బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మి తులసిని కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.



లక్ష్మీతులసిని అభినందిస్తున్న ఆస్పత్రి అధికారులు, సిబ్బంది

త్వరితగతిన పనుల పూర్తికి వినతి



కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తదితరులు

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న జీవీఎంసీ పనులు వేగవంతం చేయాలని, నూతనంగా చేపట్టాల్సిన పనులు మంజూరు చేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు, సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు పనులు, 41వ వార్డు జ్ఞానాపురంలో కమ్యూనిటీ హాల్ పనులు వేగవంతంతో పాటు ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉరికిటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, జీసీస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, పార్టీ నాయకులు యల్లపు రఘురామ్, వేళంగినిరావు, కుమార్, ఉమామహేష్ తదితరులు ఉన్నారు.